క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం ఉ.10 గంటలకు ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. గురువారం ఉ. 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. ఆపరేషన్లు అవసరం ఉన్నవారిని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందుకూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేసి ఇంటికి పంపిస్తామన్నారు. పరీక్షలకు వచ్చే వారు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు



స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

కొడంగల్ రూరల్ : పట్టణంలోని శ్రీ మహాదేవుడి ఆలయంలో బుధవారం మాసశివరాత్రిని పురస్కరించుకొని ఆలయ భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణతో దూప దీప నైవేద్యాలను సమర్పిస్తూ మంగళహారతులు ఇచ్చారు. ఉ.9గంటల నుంచి మ.12.30 గంటల వరకు ఆలయంలో లింగాష్టక పారాయణం,అభిషేకం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి, ఖడ్గాలు వేస్తూ దేవాదేవుడిని స్మరించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అర్జీల ఆన్‌లైన్ పూర్తి



దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న ఆపరేటర్లు

బంట్వారం: ప్రజాపాలన గ్రామసభల్లో బంట్వారం మండలంలో ఆరు గ్యారంటీలకు వచ్చిన 6,359 దరఖాస్తులు ఆన్‌లైన్ నమోదు పూర్తయినట్లు బుధవారం ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. రోజుకు 20 మంది చొప్పున రెండు టీంలను వేర్వేరుగా ఏర్పాటు చేసి 24 గంటలు పని చేయించడం జరిగిందన్నారు.

కోట్‌పల్లిలో 90 శాతం..

కోట్‌పల్లి మండలంలో వచ్చిన 8904 దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 90 శాతం ఆన్‌లైన్ పూర్తి చేసినట్లు కోట్‌పల్లి మండల ప్రత్యేక అధికారి రాజేశ్వర్ ప్రసాద్ తెలిపారు. రెండు టీంలను వేర్వేరుగా ఏర్పాటు చేసి 24 గంటలు పని చేయిస్తున్నామన్నారు.

ఉత్సవాలకు చీకోటి ప్రవీణ్‌కు ఆహ్వానం



చీకోటి ప్రవీణ్‌ను కలిసిన గోశాల సేవా సమితి సభ్యులు

తాండూరు టౌన్ : అయోధ్యలో భవ్య రామ మందిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా తాండూరు గోశాల సేవా సమితి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు అయోధ్య ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నెల 23వ తేదీన జరగనున్న శ్రీ సీతారాముల ఊరేగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హైదరాబాద్‌లోని శ్రీ విజయ వినాయక ఆలయం చైర్మన్ డాక్టర్ చీకోటి ప్రవీణ్‌కుమార్ హాజరుకానున్నట్లు గోశాల సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయనకు సభ్యులు వేణుగోపాల్ రెడ్డి, పటేల్ విజయ్, ఓం ప్రకాష్ సోమాని, రొంపల్లి సంతోష్‌కుమార్, మహేష్ తదితరులు ఆహ్వాన పత్రం అందజేశారు.

సీఎంను కలిసిన ప్రతాప్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్: మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా కొద్ది రోజుల క్రితమే సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపిన చౌలపల్లి మరోసారి ముఖ్యమంత్రిని కలవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

దళితబంధు నిధులు విడుదల చేయండి



కలెక్టరేట్ ముందు ధర్నా చేపడుతున్న దళితబంధు లబ్ధిదారులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్నదళితబంధు లబ్ధిదారులు

కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారుల ధర్నా

అనంతగిరి: దళితబంధు రెండో దశలో ఎంపికైన లబ్ధిదారులకు వెంటనే నిధులు విడుదల చేయాలని వికారాబాద్ జిల్లా దళితబంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ ఎర్‌స్‌పల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా దళితబంధు సాధన సమితి, దళిత సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులు గత 75 ఏళ్లుగా ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నామన్నారు. ఇప్పటికీ ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా ఉన్నామన్నారు. ప్రభుత్వం పేద వర్గాలకు ఇస్తున్న దళిత బంధు సంక్షేమ పథకం లబ్ధిదారులకు నిధులు విడుదల చేసి అభ్యున్నతికి పాటుపడాలన్నారు. దళితబంధు వస్తే మా జీవితాలు బాగు పడుతాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాధన సమితి సలహాదారు రామన్న, పెంటయ్య, వెంకటయ్య, నర్సింలు, దత్తు, డప్పు శ్రీనివాస్, బిచ్చయ్య, వెంకటయ్య, చౌడాపూర్ అశోక్, హనుమంతు, సత్తయ్య, వెంకట్‌రాములు, ఆనంద్ జిల్లాలోని ఆయా మండలాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

స్పీకర్ సహకారంతో అభివృద్ధి



యూజీడీ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

వికారాబాద్ అర్బన్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో మున్సిపల్‌లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 1వ, 7వ, 8వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.. శివారు వార్డుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో కలిసిన గ్రామాల్లో త్వరలో పట్టణ వాతావరణం కనిపించేలా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. శివారు వార్డుల్లో యూజీడీ పనులు పూర్తిస్థాయిలో చేయనున్నట్లు వివరించారు. మున్సిపల్‌లోని ప్రతి వార్డుకు మంచినీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, స్థానిక కౌన్సిలర్లు వేణుగోపాల్ రెడ్డి, గోపాల్, పరిగి సంంతోష నర్సింలు, నాయకులు దీపు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

13న ముగ్గుల పోటీలు

కొడంగల్ : ఈ నెల 13న శనివారం రోజు ఉ.10 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా తెలిపారు. పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నీటూరు గేటు సమీపంలో ఉన్న విజయ్ పత్తిమిల్లు యాజమాన్యం సహకారంతో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ఆసక్తి ఉన్నవారు ఆలయ ధర్మకర్తలను సంప్రదించాలని కోరారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

శబరిమలకు మాలధారులు



శబరిమలకు బయలుదేరిన స్వాములు

కుల్కచర్ల: మండలంలోని అయ్యప్ప మాలధారులు జ్యోతిదర్శనం కోసం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. గత 41రోజులుగా అయ్యప్పమాల ధరించిన స్వాములు బుధవారం ఇరుముడులు ధరించి శబరిమలకు బయలుదేరారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



పూజలు చేస్తున్న భజన బృందం సభ్యులు

దోమ : ప్రజలు ఆధ్యాత్మిక చింతను అలవర్చుకోవాలని తుంకిమెట్ల శ్రీ సరస్వతీ భజన మండల బృందం పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని దొంగఎన్కేపల్లిలో వెలసిన శ్రీ మల్లీకార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆయా గ్రామాల భక్తులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భజన మండలి బృందం సభ్యులంతా కీర్తనలు, భజన పాటలను ఆలపించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నాటకోపాధ్యాయుడు వెంకటయ్య, భజన మండలి బృందం సభ్యులు శివకుమార్, వీరేశం, కె.వెంకటయ్య, నాగమణి, గోవర్ధన్, వెంకటయ్య, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా అఖిల భారత బంజార సేవా సంఘం

ఏబీబీఎస్ జిల్లా అధ్యక్షుడు రాహుల్‌నాయక్



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కుల్కచర్ల: నిరుపేదలకు అఖిలభారత బంజార సేవా సంఘం అండగా ఉంటుందని అఖిల భారత బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాహుల్ నాయక్, జిల్లా నాయకులు విఠల్ నాయక్ అన్నారు. మండలంలోని సాల్వీడు గ్రామ పంచాయతీకి చెందిన పాలెపల్లి దశరథ్ రెండురోజుల క్రితం మృతి చెందారు. కాగా, విషయం తెలుసుకున్న రాహుల్‌నాయక్ తన సహచరులతో కలిసి బాధిత కుటుంబీకుల ఇంటికి వెళ్లి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.4వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతికి అఖిలభారత బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో తమ సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. తన తండ్రి రవీందర్‌నాయక్ చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, బాలు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల జీహెచ్ఎం శ్రీశైలం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలన్నారు. ఈ స్థాయిలోనే బాగా చదివితే ఉన్నత స్థాయిలో సైతం రాణించగలుగుతామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం రాజశేఖర్, స్కూల్ హెచ్ఎం వీరేశం, ఆనంద్‌కుమార్, నస్రీన్ సుల్తానా, పద్మ, శ్రీనివాస్‌రెడ్డి, సరస్వతి, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మరికల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ సహచరులకు పాఠ్యాంశాలను బోధించారు. విద్యాశాఖమంత్రిగా పల్లవి, కలెక్టర్‌గా రాంచరణ్‌చారి, డీఈఓగా అరవిందు, ఎంఈఓగా జశ్వంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా హరిలు వ్యవహరించారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపీపీ

ధారూరు: ధారూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం పీఆర్టీయూ నూతన క్యాలెండర్‌ను ఎంపీపీ జె. విజయలక్ష్మి ఆవిష్కరించారు. గోడ క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్లను పలువురికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, తహసీల్దార్ భువనేశ్వర్, పీఆర్టీయూ సంఘం బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు చెబుతున్న వ్యాపారులు

షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాశ్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిశారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. శంకర్‌ను కలిసిన వారిలో మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి పెంటయ్య, సభ్యులు జగదీశ్, చెన్నారెడ్డి, త్రినాథ్, శ్రీకాంత్, కుమార్ ఉన్నారు.

చూపు లేకపోయినా ప్రయోజకులు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: కంటి చూపు లేకపోయినా చదువుకోని ప్రయోజకులం కాగలమని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి డాక్టర్ లూయిస్ బ్రెయిలీ అని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. బుధవారం అంబేడ్కర్ భవనంలో విజువల్లి చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహ ఆధ్వర్యంలో డాక్టర్ లూయిస్ బ్రెయిలీ 215వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన చైర్‌పర్సన్ మాట్లాడుతూ..అంధులు ఎవరూ కూడా కంటి చూపు లేదని బాధపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. డాక్టర్ లూయిస్ చూపిన మార్గంలో నడిచి ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు హసిబ్, దీపు, డిడబ్ల్యూఓ ఎఫ్ఆర్ఓ వెంకట్, వీహెచ్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్, లూయిస్ బ్రెయిలీ కమిటీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, అంజమ్మ, పద్మ, కవిత, సయ్యద్ గౌస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

యాలాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ సంఘం ముందు వరుసలో ఉంటుందని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇందోలు శ్రీధర్‌రెడ్డి, యాదయ్యగౌడ్‌లు అన్నారు. బుధవారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం కట్టుబడి ఉందన్నారు. పాఠశాలల్లో ఉన్న విద్యుత్ కనెక్షన్‌లను కమర్షియల్ నుంచి డొమెస్టిక్ కనెక్షన్‌లకు మార్చడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. సకాలంలో వేతనాలు, బదిలీలు, పదోన్నతులు చేపడతామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యావలంటీర్లను ఏర్పాటు చేసి పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తామని, ఆయా పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమిస్తామంటూ ప్రభుత్వం పేర్కొవడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ సంఘ నాయకులు సుధాకర్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, ప్రశాంత్, మంజూభాషిణి, రమాకాంత్ తదితరులు ఉన్నారు.

ధారూరులో సామాజిక తనిఖీ



ధారూరులో చేస్తున్న సామాజిక తనిఖీ బృందాలు

ధారూరు: ధారూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు సంబంధించి సామాజిక తనిఖీ నివేదికలను అధికారులు రాత్రి వరకు పరిశీలన చేశారు. మండలంలో 2021 ఆగస్టు నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీలు చేశారు. తనిఖీ బృందాలు గ్రామాల్లో చేపట్టిన వివిధ రకాల ఉపాధి పనుల నివేదికలను బహిరంగ సభలో చదివి వినిపించారు. ఈ పనుల్లో జరిగిన లోటుపాట్లను అధికారులు నమోదించారు. రూ. 9,39,79,314ల విలువైన పనులకు సంబంధించిన ఉపాధి పనులపై తనిఖీ నిర్వహించారు. అవకతవకలు, విధించిన పెనాల్టీలు, చర్యల గురించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ క్రిష్ణన్, అడిషనల్ డీఆర్డీఓ స్టీఫెన్, అంబుడ్స్‌మెన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సుజాత, విజిలెన్స్ అధికారి భార్గవి, ఎస్ఆర్‌పీ యాదగిరి, ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, ఏపీఓ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, డీఆర్డీపీలు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సోదరుడు ఆర్‌బీఎల్ చైర్మన్ బుయ్యాని శ్రీనివాస్‌రెడ్డి మండలానికి వచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, కుల్కచర్ల మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులు, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, నాయకులు మొగులయ్య, గాంగ్యానాయక్, కృష్ణయ్య, నర్సింలు పాల్గొన్నారు.

బహుజన వీరుడు.. పండగ సాయన్న

ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్



పండగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కాసాని వీరేశ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు

కుల్కచర్ల: అణగారిన వర్గాల ప్రజల కష్టాలను చూసి మనస్సు చలించి పెత్తందారుల దగ్గర ఉన్న సంపదను పేద ప్రజలకు పంచిన గొప్ప ధీరుడు పండగ సాయన్న అని ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్, ఆర్‌బీఎల్ సంస్థ చైర్మన్ తాండురు ఎమ్మెల్యే సోదరుడు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామంలో పండగల సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలు పెత్తందారుల చేతుల్లో దీనావస్థకు గురవుతున్న దుస్థితిని గ్రహించి పేదవారి ఆకలిని తీర్చేందుకు పెట్టుబడిదారి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసినా గొప్ప వీరుడు పండగ సాయన్నయని కొనియాడారు. కొందరు అగ్రవర్ణాల వారు పండగ సాయన్నను దొంగగా అభివర్ణించి ఆయన గొప్పతనాన్ని భహిర్గతం కాకుండా చేశారని మండిపడ్డారు. పండగ సాయన్న జీవితం ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ముదిరాజ్‌లందరూ సంఘటితంగా ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కరణం ప్రహ్లాదరావు మాట్లాడుతూ.. పండగ సాయన్నకు మన కుల్కచర్ల మండలంతో సంబంధాలు ఉండటం ఎంతో ఆనందించదగ్గ అంశమన్నారు. వారి జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, స్థానిక సర్పంచ్ అనురాధబాల్‌రెడ్డి, ఎంపీటీసీ పద్మరఘుగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, యువజన విభాగం జిల్లా నాయకులు కుమ్మరి స్వామి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలముకుందం, నియోజకవర్గ అధ్యక్షుడు రామస్వామి, కుల్కచర్ల మండల సంఘ అధ్యక్షుడు చంద్రలింగం, చౌడాపూర్ మండల సంఘం అధ్యక్షుడు కృష్ణ, కార్యక్రమ నిర్వాహకులు గ్రామ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు గాదె రామయ్య, ఉపాధ్యక్షుడు వెన్నచేటి చిన్న చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి మొగులయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా నాయకులు శ్రీనివాస్, నర్సింలు, అంజిలయ్య, ఎల్లయ్య, ఆంజనేయులు, బొవ్వని నర్సింలు, రేణి వెంకటయ్య, రాములు, నర్సింలు, రాములు తదితరులు పాల్గొన్నారు.